క్లుప్తంగా

నవంబర్ 9న కాపు కార్తీక వనభోజన మహోత్సవం

ఒంగోలు వన్‌టౌన్: ప్రకాశం జిల్లా కాపు సంఘం కార్తీక వనభోజన మహోత్సవాన్ని నవంబర్ 9వ తేదీ నిర్వహించనున్నట్లు కాపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవరావు తెలిపారు. ఒంగోలులోని కాపు సంఘ కార్యాలయంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్తీక వనభోజన మహోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో పలువురు కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

సమాచారశాఖ ఉద్యోగినికి ఘనంగా వీడ్కోలు



సుబ్బమ్మను సన్మానిస్తున్న సమాచార శాఖ అధికారులు, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: సమాచారశాఖలో 38 ఏళ్ల 6 నెలలకుపైగా విధులు నిర్వహించి ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేస్తున్న ఏ సుబ్బమ్మను సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది బుధవారం సన్మానించి వీడ్కోలు పలికారు. కలెక్టరేట్‌లోని సమాచార శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టైపిస్టుగా, సీనియర్ అసిస్టెంట్‌గా నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో సుబ్బమ్మ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ టి.కస్తూరి బాయి, డి.పి.ఆర్.ఓ.రమేష్, డివిజనల్ పి.ఆర్.ఓ.దుర్గాప్రసాద్, డీఐపీఆర్‌ఓ, ఆర్‌జేడీ, ఆర్ఐఈ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు అసౌకర్యం లేకుండా చూడాలి

ఒంగోలు సిటీ: ఒంగోలులోని నాలుగు కేంద్రాలలో బస చేయనున్న డీఎస్సీ అభ్యర్థులు, సహాయకారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలకృష్ణ విద్యాశాఖాధికారిని ఆదేశించారు. బుధవారం మెగా డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు నియామకపత్రాల అందజేత కార్యక్రమం సందర్భంగా ప్రకాశం జిల్లాకు సంబంధించి ఒంగోలు నగరంలో రామచంద్ర మిషన్, సెయింట్ జేవియర్స్ హైస్కూల్, క్విస్ కళాశాల, ఆక్సీలియం హైస్కూల్‌లో బస ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మొత్తం 4 కేంద్రాల్లో ప్రకాశం జిల్లాలో ఎంపిక కాబడిన 621 మంది అభ్యర్థులు, వారి సహాయకారుగా వారి కుటుంబాల నుంచి 1077 మంది మొత్తం 1698 మందికి వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించారు. వీరిని 43 బస్సులలో గురువారం నియామక పత్రాల అందజేత కార్యక్రమానికి తరలించడం జరుగుతుందని తెలిపారు.

సెయింట్ థెరిసా చర్చిలో నవదిన వేడుకలు



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

ఒంగోలు మెట్రో: స్థానిక సెయింట్ థెరిసా చర్చిలో బుధవారం నవదిన వేడుకలు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో నిర్వహించగా, చర్చి ఫాదర్ డీఎస్ పాల్, అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు పాల్గొని దివ్యబలిపూజ నిర్వహించి భక్తులకు ప్రసాదం అందజేశారు. గోపాలనగరం, కమ్మపాలెం సంఘ పెద్దలు, గాలి అంజనీకుమారి పాల్గొన్నారు.

అన్నపూర్ణా.. నమోస్తుతే



అన్నపూర్ణాదేవి అలంకరణలో అచలానందాశ్రమంలోని గోవిందమాంబ అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు
- మూడోరోజు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

ఒంగోలు మెట్రో: దసరా దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడోరోజు జిల్లా వ్యాప్తంగా దేవాలయాలలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సకల శుభాలను కలిగించే అమ్మవారిని కొలుస్తూ ఒంగోలు నగర ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయం నుంచి మహిళా భక్తులతో ఆలయాలలో సందడి నెలకొంది. ఆలయ నిర్వాహకులు, అధికారులు భక్తుల సౌకర్యార్థం క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. స్థానిక బాలాజీరావుపేటలోని శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం, గద్దలగుంట బుర్ర బావి దగ్గర వెలసియున్న మహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి దేవస్థానం, రంగారాయుడు చెరువు వద్ద ఉన్న కంచి కామాక్షమ్మ దేవాలయం, కేశవస్వామిపేటలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం, గంటాపాలెంలోని పార్వతమ్మ దేవాలయం, గద్దలగుంటలోని రాజరాజేశ్వరి దేవాలయం, సమతానగర్లోని దుర్గామల్లేశ్వరి దేవాలయం, లాయరుపేట షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానంలో కొలువైయున్న రాజ్యలక్ష్మి అమ్మవారికి, కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి, గద్దలగుంటలో వేప అంకమ్మ తల్లికి, గాంధీరోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో, ఏనుగు చెట్టు దగ్గర కాళికాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవార్లు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడులోని గంగా పార్వతీ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారికి బుధవారం దేవీ నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు బుజ్జిబాబుశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

మొదటిరోజు ఉభయదాతలు జి.కృష్ణమూర్తి, సీహెచ్ సుధాకర్, మద్ది సుబ్రహ్మణ్యం, ఎండోమెంట్ ఏవో నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ ఉమమహేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎ.శ్రీనివాసరావు, జి.లక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి



అన్నపూర్ణాదేవి అలంకరణలో కేశవస్వామిపేట విజయదుర్గాదేవి



అమ్మవారి కలశాలతో మహిళా భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంతపేట సాయిబాబా ఆలయంలోని నాగలక్ష్మి అమ్మవారు



అన్నపూర్ణాదేవి అలంకరణలో లాయరుపేట సాయిబాబా ఆలయంలోని రాజరాజేశ్వరీదేవి



నెహ్రూకాలనీలో దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



సంతనూతలపాడులో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో పార్వతీదేవి



చాక్లెట్‌లతో గాయత్రీదేవి అలంకరణలో గంటాపాలెం పార్వతీదేవి అమ్మవారు





అన్నపూర్ణాదేవి అలంకరణలో బాలాజీరావుపేట కనకదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు





అన్నపూర్ణాదేవి అలంకరణలో వాసవీకన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు, ఆలయంలో కోలాటం చేస్తున్న మహిళలు

వైఎస్సార్ సీపీ నాయకులకు బూచేపల్లి, మేరుగు పరామర్శ



ఊదరగుడి విజయ్‌ను పరామర్శిస్తున్న మేరుగు నాగార్జున, నాయకులు



అనిల్‌ను పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నాయకులు

ఒంగోలు టౌన్/నాగులుప్పలపాడు: ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న ఇద్దరు వైఎస్సార్ సీపీ నాయకులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున బుధవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ప్రమాదవశాత్తూ గాయపడి ఒంగోలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ అనిల్‌ను బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నాగులుప్పలపాడు మండల నాయకులతో కలిసి పరామర్శించారు.

అదేవిధంగా బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ నగరంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శి ఊదరగుడి విజయకుమార్‌ను పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పరామర్శించారు. ఐసీయూలో ఉన్న విజయకుమార్‌ను కలిసి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి వైద్యులను కలిసి నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

ఒంగోలు వన్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఒంగోలు ప్రగతి భవన్‌లోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బకాయిల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పంపిన సందేశాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరకుమార్, వెనుకబడిన తరగతుల శాఖ ఉద్యోగులు షర్మిల, సంధ్యారాణి, అంకబాబు, ఆంజనేయులు ప్రసాద్, రహమతుల్లా, సంఘం ఒంగోలు అధ్యక్షుడు మోటారు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

132 మందికి వైద్య పరీక్షలు



పీహెచ్‌సీలో ఆరోగ్యంపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్వస్తినారి స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రెండో సచివాలయం పరిధిలోని 132 మంది రోగులకు డాక్టర్ నాగరాజు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ సుధామణి పర్యవేక్షించగా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాధవరావు, సావిత్రి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 20 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన ఇంజినీరింగ్ విద్యార్థులు

చీమకుర్తి: చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగళూరుకు చెందిన క్యూ స్పైడర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ కంపెనీకి చెందిన హెచ్ఆర్‌సీ తేజస్విని, ఐశ్వర్య ఆధ్వర్యంలో మూడు రౌండ్లు ఇంటర్వ్యూలు నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారు. వారికి ఆఫర్ లెటర్లు ఇచ్చి డిసెంబర్ 22న బెంగళూరులోని తమ కంపెనీలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ యాజమాన్యం అయిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రిన్సిపాల్ ఏవీ కుమార్, కో ఆర్డినేటర్ కోటిరెడ్డి, కాలేజీ అధ్యాపకులు అభినందించారు.

13 గంటల పని వద్దు..

- కార్మికుల పని భారం తగ్గించండి
- మున్సిపల్ పారిశుధ్య కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన



మస్టర్ పాయింట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు, సీఐటీయూ నాయకులు

ఒంగోలు సబర్బన్: మున్సిపల్ కార్మికుల పనిభారాన్ని తగ్గించాలని నగర మున్సిపల్ వర్కర్స్–ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒంగోలు నగర్ కమిటీ ఆధ్వర్యంలో మూడో డివిజన్ మాస్టర్ పాయింట్ వద్ద బుధవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 8 గంటల పని దినాలు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ సంస్థల యాజమాన్యానికి అనుకూలంగా కార్మిక చట్టాలన్నింటినీ, హక్కుల్ని నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులు, ఉద్యోగుల బానిస వ్యవస్థను ఏర్పాటు చేస్తోందని ధ్వజమెత్తారు. ఈరోజు అసెంబ్లీ సమావేశాల్లో నుంచి 13 గంటలు పని విధానాన్ని పెంచటం అనేది కార్మిక వర్గానికి ద్రోహం చేసినట్లేనని మండిపడ్డారు. అలాగే రాత్రి షిఫ్ట్‌లో మహిళలకు పనిగంటలు ఏర్పాటు చేయడమంటే మహిళలపై జరిగే దాడులను ప్రోత్సహించటమేనన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. 13 గంటల పని పెంపుపై రానున్న రోజుల్లో ఉద్యోగులు, కార్మికులు ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ ఒంగోలు నగర కన్వీనర్ టి.మహేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోగా, చట్టాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగించే పద్ధతిలో పని గంటలు పెంపు ఉందని ధ్వజమెత్తారు. యూనియన్ నగర అధ్యక్షుడు జీ నరసింహ, నాయకులు డీ రమణ, పీ కోటేశ్వరి, ఏడుకొండలు, రమాదేవి ,శ్రీను, సుకుమార్ సురేష్, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సచివాలయం అడ్మిన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఒంగోలు టౌన్: నగరంలోని గాంధీనగర్ డివిజన్‌లోని వడ్డేవాని కుంట, సుందరయ్య కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ బాబు డిమాండ్ చేశారు. ఆ మేరకు గాంధీనగర్ సచివాలయం అడ్మిన్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. సీఐటీయూ నాయకులు ఎస్డీ హుసేన్, గురవయ్య, రామకృష్ణ, సురేష్, రవి, ఆనంద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేయాలి

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన దుకాణాలలో దివ్యాంగులకు రిజర్వేషన్లు అమలు చేసి దుకాణాలు కేటాయించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి అధ్యక్షుడు ఎస్‌కే కాలేషా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సీహెచ్ సువార్తకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఒంగోలు ఏబీఎం కళాశాల ఎదురుగా ఎస్సీ కార్పొరేషన్‌కు చెంది ఖాళీగా ఉన్న రెండు దుకాణాలను దివ్యాంగులకు కేటాయిస్తే వారు ఉపాధి పొందుతారని అన్నారు.

ఘనంగా జాతీయ సేవా పథకం దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కళ్యాణి

ఒంగోలు సిటీ: జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.కళ్యాణి పాల్గొని మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించి సమాజాభివృద్ధి కోసం వారిని ప్రేరేపిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాధికారి ఎన్ఎస్ఎస్ చరిత్ర, లక్ష్యాలు, విజయాలను వివరించారు. విద్యార్థులు కళాశాల పరిసరాలను పరిశుభ్రం చేసి మొక్కలు నాటారు. 'స్వచ్ఛ భారత్ – హరిత భారత్' అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, వాదవివాదం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రతిజ్ఞను అందరూ పఠించి సమాజ సేవకు అంకితం కావాలన్నారు. ఎం.సుధారాణి, సీహెచ్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాధవరావు

చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చీమకుర్తిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పొగాకు పంట నియంత్రణ అవసరం

నాగులుప్పలపాడు: పొగాకు పంట సాగులో రైతులు నియంత్రణ పాటించాలని ఐటీసీ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు అన్నారు. పొగాకు పంటపై బుధవారం ఓబన్నపాలెం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీసీ ప్రతినిధులు మాట్లాడుతూ పొగాకు పంట సాగు చేయడంలో నారుమడి ఎంపిక చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో జీపీఐ మేనేజర్ శ్రీనివాసరావు, కిషోర్, రైతులు పాల్గొన్నారు.